25న బీసీల సమరభేరి

- జనగణనలో కులగణన చేపట్టాలి
- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, నవంబర్ 22(నమస్తే తెలంగాణ): జనగణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 25న రవీంద్రభారతి వేదికగా బీసీల సమరభేరి సదస్సు నిర్వహించనున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే రోజులో బిల్లు పెట్టి ఆగమేఘాలపై 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించిన బీజేపీ సర్కారు.. బీసీలు ఏండ్లుగా పోరాడుతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. బీసీల కోసం కేంద్రస్థాయిలో ఒక్క పథకాన్ని కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. చట్టసభల్లో, ఉద్యోగ ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, క్రీమీలేయర్‌ను తొలగించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమరభేరి సదస్సుకు బీసీలు, కులసంఘాల ప్రతినిధులు భారీగా తరలిరావాలని కోరారు.

కృత్రిమ మందుల కొరత సృష్టిస్తే చర్యలు

- ఫార్మాసిస్టులు బాధ్యతతో పనిచేయాలి
- మంత్రి దామోదర సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల్లో కృత్రిమ మందుల కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. సెంట్రల్ మెడికల్ స్టోర్స్(సీఎంఎస్)బలోపేతంపై మంత్రి శుక్రవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఫెసిలిటీ పనితీరుపై ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అందజేసిన నివేదికపై చర్చించారు. ప్రభుత్వ దవాఖానల్లో ఫార్మాసిస్టులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఫుడ్‌సేఫ్టీపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఫుడ్‌సేఫ్టీపై తీసుకుంటున్న చర్యలపై కమిషనర్ ఆర్వీ కర్ణన్ పీపీటీ ద్వారా వివరించారు. అనంతరం మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ.. ఆహార కల్తీకి పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షల్లో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ బోర్కడే, డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, ఐపీఎం డైరెక్టర్ శివలీల, డాక్టర్ అమర్ సింగ్, శేషాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మరో 50 మందికి కమిషన్ పిలుపు

- 24 నుంచి కాళేశ్వరంపై బహిరంగ విచారణ
- ఆ తరువాత పూర్వ, ప్రస్తుత సెక్రటరీల వంతు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరంతోపాటు ఆ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంపై విచారణ ప్రారంభించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మరి కొందరు ఇంజినీర్లకు సమన్లు జారీచేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములైన క్వాలిటీ కంట్రోల్, ఓఅండ్ఎం తదితర విభాగాల ఇంజినీర్లు, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులు సమర్పించిన అఫిడవిట్లపై ఇప్పటికే బహిరంగ విచారణను పూర్తిచేసిన ఈ కమిషన్.. క్షేత్రస్థాయిలో పనిచేసిన మరో 50 మంది ఇంజినీర్లను విచారణకు పిలవాలని నిర్ణయించినట్టు సమాచారం. సోమవారం నుంచి వారిని ప్రశ్నించేందుకు కమిషన్ సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఇరిగేషన్ శాఖకు సంబంధించిన పూర్వ సెక్రటరీలతోపాటు ప్రస్తుత సెక్రటరీలను కూడా విచారించేందుకు కమిషన్ కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే అఫిడవిట్లు దాఖలు చేసిన రిటైర్డ్ ఇంజినీర్లు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు, ఇతర వ్యక్తులను సైతం ఈ విచారణకు పిలవాలని కమిషన్ యోచిస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విజిలెన్స్ కమిషన్ ఇప్పటికే విచారణ జరిపి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విషయం తెలిసిందే. దీంతో ఆ నివేదిక వివరాలను తెప్పించుకునేందుకు సన్నాహాలు చేస్తున్న కమిషన్.. ఆర్థిక శాఖ అధికారులను సైతం విచారించాలని భావిస్తున్నది.

26 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మరో 26 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, మొదటి విడతలో 28 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మంజూరు చేసింది.

రోడ్డు పాలైన కులగణన పత్రాలు

- తార్నాక రోడ్డుపై సర్వే పత్రాలు
- అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం
- మేడ్చల్‌లో వరుస ఘటనలు
- ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం

హైదరాబాద్ సిటీబ్యూరో/జవహర్‌నగర్/తార్నాక, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా చేస్తున్న కులగణన సర్వే మొక్కుబడిగా జరుగుతున్నది. దేశానికే దిక్సూచి, సామాజిక న్యాయం అంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసిన ప్రభుత్వం ఆచరణలో తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తున్నది. సర్వే పత్రాలు రోడ్లపై చిత్తు కాగితాలుగా దర్శనమిస్తున్నాయి. సర్వేకు ప్రజలు అందించిన సహకారాన్ని ప్రభుత్వం హేళన చేస్తున్నట్టుగా వ్యవహరిస్తున్నది.

చిత్తశుద్ధి లేని సర్వే!

కులగణన సర్వేలో అధికారుల వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజల వివరాల సేకరించి కార్యాలయాల్లో భద్రంగా దాచాల్సిన కీలక పత్రాలను రోడ్డున పడేస్తున్నది. ఈ నెల 13న మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో పూరించని కుటుంబ సర్వే ఫారాలు జాతీయ రహదారిపై దర్శనమిచ్చాయి. ఓ ఘటన జరిగిన తర్వాత అయినా జాగ్రత్త పడాల్సిన అధికారులు మళ్లీ అదే నిర్లక్ష్యం పునరావృతం చేశారు. మేడ్చల్ జిల్లా తార్నాకలో పూరించిన సర్వే పత్రాలు రోడ్డుపై దర్శనమిచ్చాయి. ఇవి కాప్రా మండలం డివిజన్ 27 భక్తబాయికాలనీకి చెందిన కుటుంబాల సర్వే పత్రాలుగా స్థానికులు గుర్తించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ పత్రాలను ఎన్యూమరేటర్ నిర్లక్ష్యంతో పోగొట్టుకున్నట్టు తెలుస్తున్నది. సర్వే పత్రాలు రోడ్డుపై దర్శనమివ్వడంపై జవహర్‌నగర్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని 'నమస్తే తెలంగాణ ప్రతినిధి' వివరణ కోరగా "నాకేం తెల్వదు" అంటూ ఫోన్ కట్ చేశారు.

తార్నాకలో రోడ్డుపై పారేసిన సర్వేపత్రాలు

ప్రజల బతుకును రోడ్డు పాలు చేస్తారా?

ప్రజల వివరాల సేకరణ పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది మరో నిదర్శనం. తెలంగాణ ప్రజల బతుకు వివరాలను బయట పడేయడమే మీ సర్వే లక్ష్యమా? సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో వచ్చిన వివరాల భద్రత డొల్ల అని స్పష్టమవుతున్నది. ఈ వివరాలు సైబర్ మోసగాళ్ల చేతికి చిక్కితే ప్రజల పరిస్థితి ఏమిటి? ప్రజల గోప్యతా హక్కుకు భంగం కలిగించేలా ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఉంది. ఈ ఘటన పట్ల ప్రభుత్వం సీరియస్‌గా స్పందించాలి. ప్రజల వివరాలకు భద్రత కల్పించాలి.

– హరీశ్‌రావు, మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే

నాడు ప్రజాపాలన.. నేడు కులగణన

కాంగ్రెస్ అధికారంలోకి ఆర్భాటపు ప్రకటనలతో రాగానే ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ప్రజాపాలన అంటూ దరఖాస్తులు తీసుకుంది. ఆ పత్రాలు రోడ్లపై, బార్లలో పొట్లాలు కట్టే కాగితాల్లో, చెత్తలో కనిపించాయి. ఇప్పుడు కులగణను పత్రాలు కూడా రోడ్లపైకే చేరుతున్నాయి. ప్రజలు చాలా సమయం కేటాయించి, ఓపికగా సర్వేకు సహకరిస్తున్నారు. వ్యక్తిగత వివరాలను రోడ్డు పడేయడం దారుణమని ప్రజలు, నెటిజన్లు మండిపడుతున్నారు.

హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ జాగృతి ముఖ్యనాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బీసీ కులగణనపై చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్
- త్వరలో కులగణన డెడికేటెడ్ కమిషన్‌కు నివేదిక
- తెలంగాణ జాగృతి సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): కులగణన, స్థానిక రిజర్వేషన్ల పెంపుపై అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన కుల గణన డెడికేటెడ్ కమిషన్‌కు నివేదిక అందించాలని తెలంగాణ జాగృతి నిర్ణయించింది. త్వరలో కులగణన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావుకు జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తమ ప్రతినిధుల బృందంతో కలిసి నివేదిక అందించనున్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆమె జాగృతి నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాలకు విద్య ఉపాధి రాజకీయ రంగాల్లో సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఆవేదన చెందారు. సమాజంలో అంతరాలను రూపుమాపేందుకు, బలహీనవర్గాలను ఉన్నతస్థితిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వాలు కృషిచేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బీసీలకు రాజకీయ రంగంలో రిజర్వేషన్లు పెంచాల్సిందేనని తేల్చిచెప్పారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుల సర్వేను నామమాత్రంగా కాకుండా పకడ్బందీగా చేసి రిజర్వేషన్లు పెంచి తన చిత్తశుద్ధినిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సమావేశం కీలక నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో కులగణన, స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపుపై కొన్ని నెలల క్రితం జాగృతి ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సమావేశాల్లో జాగృతి నాయకులు, బీసీ సంఘాల నేతలు, మేధావులు, జర్నలిస్టులు, కవులు, కళాకారులు, వివిధ వర్గాల ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. వాటిని జాగృతి క్రోడీకరించి నివేదిక రూపొందించింది. జిల్లాల వారీగా పూర్తి వివరాలు, బీసీల లెక్కలతో తెలంగాణ సామాజిక స్వరూపాన్ని ఆవిష్కరించేలా పకడ్బందీగా నివేదికను సిద్ధంచేశారు. నివేదిక రూపకల్పనలో బీసీ నాయకులు, విద్యావేత్తలు, మేధావులు సహా ఇతర రంగాల నిపుణుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నారు. ఉద్యమ సమయంలో అప్పటి శ్రీకృష్ణ కమిటీకి నివేదిక సమర్పించినట్టుగానే తాజాగా డెడికేటెడ్ కమిషన్‌కు సమగ్ర నివేదికను రూపొందించారు. ఈ సందర్భంగా 17 ఏండ్లుగా అనేక అంశాల్లో జాగృతి కీలక పాత్ర పోషించిన విషయాన్ని, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల కోసం కల్వకుంట్ల కవిత పోరాడిన తీరును ఈ సమావేశంలో చర్చించారు.

ఫార్మాసిటీలోనే ఫార్మా కంపెనీలు

- ఆరు కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకారం
- సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కంపెనీల ఎంవోయూ
- 4 నెలల్లో కేటాయింపుల పూర్తికి సీఎం ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీలోనే ఆరు ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాలుష్యరహితంగా గ్రీన్ ఫార్మా కంపెనీలను నెలకొల్పేందుకు రాష్ట్రప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకున్నది. ఎంఎస్ఎన్ గ్రూప్, లారస్ ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్, అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్ కంపెనీలతో శుక్రవారం ఈ అవగాహన ఒప్పందాలు జరిగాయి. కంపెనీలు తమ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా నాలుగు నెలల్లో స్థలాల కేటాయింపుతోపాటు, అవసరమైన సదుపాయాలను కల్పించాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ ఆరు కంపెనీలు దాదాపు రూ.5,260 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటి ద్వారా ఫార్మా రంగంలో 12,490 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. టీఎస్ఐఐసీ చైర్మపర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, రెడ్డీస్ ల్యాబ్స్ డైరెక్టర్ సతీశ్‌రెడ్డి, లారస్ ల్యాబ్స్ ఈడీ వీవీ రవికుమార్, గ్లాండ్ ఫార్మా సీఈవో శ్రీనివాస్, ఎంఎస్ ల్యాబ్స్ సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి, అరబిందో డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, హెటిరో గ్రూప్ ఎండీ వంశీకృష్ణ పాల్గొన్నారు.

కంపెనీలు నెలకొల్పే యూనిట్లు ఇవే..

ఎంవోయూల ఒప్పందాల ప్రకారం ఎంఎస్ఎన్ లాబోరేటరీ ఫార్మాసిటీలో మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌తోపాటు ఆర్ అండ్ డీ సెంటర్ నెలకొల్పనున్నది. లారస్ ల్యాబ్స్, అరబిందో ఫార్మా ఫార్ములేషన్ యూనిట్లు నెలకొల్పుతాయి. గ్లాండ్ ఫార్మా ఆర్‌అండ్‌డీ సెంటర్, ఇంజెక్టబుల్స్, డ్రగ్ సబ్‌స్టన్స్ మాన్యుఫాక్చర్, డాక్టర్ రెడీస్ లాబ్స్ ఇంజెక్టబుల్, బయోసిమిలర్ల యూనిట్ ఏర్పాటు చేస్తుంది. హెటిరో ల్యాబ్స్ ఫినిష్డ్ డోస్, ఇంజక్టబుల్ తయారీ పరిశ్రమను నెలకొల్పనున్నది.

ఫార్మాసిటీకి లైన్‌క్లియర్ అయినట్టేనా?

దాదాపు 11 నెలలుగా ఫార్మాసిటీపై హైడ్రామా కొనసాగిస్తున్నది. అధికారంలోకి రాగానే 'ఫార్మాసిటీ'ని రద్దు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ తర్వాత అక్కడ ఫోర్త్ సిటీని నిర్మిస్తామంటూ హడావుడి చేశారు. ఫార్మా కంపెనీల కోసం 10 ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తామంటూ నోటిఫికేషన్లు కూడా ఇచ్చారు. దీంతో అటు ఫార్మా సిటీకి భూములు ఇచ్చిన రైతులు, ఇటు ఫార్మా క్లస్టర్లతో భూములు కోల్పోయే రైతులు ప్రభుత్వంపై తిరగబడ్డారు. ఫార్మాసిటీ రైతులు ఏకంగా కోర్టు మెట్లెక్కారు. దీంతో 'ఫార్మాసిటీని కొనసాగిస్తాం' అని కోర్టు ముందు ప్రభుత్వం ఒప్పుకోక తప్పలేదు. మరోవైపు ఫార్మా క్లస్టర్ ఏర్పాటుపై లగచర్లలో భూసేకరణ అంశం విమర్శలకు దారితీసింది. ఈ అంశంపై జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫార్మా క్లస్టర్ల ఏర్పాటుపై ప్రభుత్వం వెనుకడుగు వేసిందని ప్రచారం జరుగుతున్నది. దీనిని నిర్ధారించేలా ఫార్మాసిటీలో కంపెనీలకు భూములు కేటాయించారు. దీంతో ఫార్మాసిటీకి లైన్‌క్లియర్ అయినట్టేనని చెప్తున్నారు. ఇదిలా ఉండగా సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులను సీఎం పరిశీలించారు. సౌత్ కరోలినా హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్ జేప ఏరియల్ మూర్ సీఎంని కలిశారు.

గ్లోబల్ లీడర్‌గా హైదరాబాద్

కామన్‌వెల్త్ మేడ్-ఆర్బ్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఫ్యూచర్‌సిటీ, ఏఐసిటీ లాంటి వినూత్న ప్రాజెక్టులతో హైదరాబాద్ సమీప భవిష్యత్తులో గ్లోబల్ లీడర్‌గా అవతరించనున్నదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కామన్‌వెల్త్ మేడ్-ఆర్బ్ కాన్ఫరెన్స్-24లో ఆయన పాల్గొని మాట్లాడారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీతో హైదరాబాద్ పరిశ్రమల హబ్‌గా గుర్తింపు పొందిందని తెలిపారు. ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ మూలస్తంభమని, ప్రస్తుతం కోర్టుల్లో భారీగా కేసులు పెండింగ్‌లో ఉండటం న్యాయవ్యవస్థకు సవాల్‌గా మారిందని చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్న ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్‌ను సీఎం అభినందించారు. సామాన్యులకు ఐఏఎంసీ సేవలందించాలని కోరారు. ఆర్బిట్రేషన్ మ్యాపులో లండన్, సింగపూర్ తర్వాత హైదరాబాద్ ఉండటం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.

- చచ్చిన చేపపిల్లలు మాకొద్దు

నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి చెరువులో నాణ్యతలేని చేప పిల్లలను వదిలిపెట్టేందుకు ప్రయత్నించిన అధికారులను మత్స్య సహకార సంఘం నాయకులు అడ్డుకున్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి రజినికి ఫోన్ చేసి నాణ్యమైన చేపపిల్లలను పంపిణీ చేయాలని కోరారు.

– పెద్దకొత్తపల్లి

ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టుల మృతి

- ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో ఘటన

కొత్తగూడెం క్రైం, నవంబర్ 22: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు మరణించారు. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ పాటిలింగం తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొరాజుగూడ, దంతేశ్పురం, నాగారం బండారపదార్ అటవీ ప్రాంతాల్లో కిష్టారం-కొంట ఏరియా కమిటీ మావోయిస్టులు సమావేశమవుతున్నట్లు భద్రతా దళాలకు సమాచారం అందింది. దీంతో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ దళాలు గాలింపు చేపట్టాయి. వెంటనే భద్రతా దళాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. ఇరు వర్గాల మధ్య సుమారు రెండు గంటలపాటు కాల్పులు జరిగాయి. మావోయిస్టులంతా పల్లపు ప్రాంతంలో ఉండడంతో ఎత్తయిన ప్రదేశం నుంచి జవాన్లు మావోయిస్టులను ముట్టడించారు. భారీగా మోహరించిన జవాన్ల కాల్పుల ధాటికి తాళలేక మావోయిస్టులు అక్కడి అటవీ మార్గం మీదుగా పారిపోయారు. ఘటన స్థలం నుంచి పది మంది మావోయిస్టుల మృతదేహాలతోపాటు ఒక ఏకే-47, ఎస్ఎల్ఆర్‌లు, ఇన్‌సాస్ రైఫిళ్లు, ఆటోమెటిక్, సెమీ-ఆటోమెటిక్ ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా.. మృతుల్లో రూ.21 లక్షల రివార్డు ఉన్న మావోయిస్టులు ఆరుగురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ఎన్‌కౌంటర్ తర్వాత సుక్మా జిల్లా అటవీ ప్రాంతంలో నృత్యాలు చేస్తున్న జవాన్లు

ఎన్‌కౌంటర్ తర్వాత జవాన్ల సంబురాలు

పది మంది మావోయిస్టులను మట్టుబెట్టిన తర్వాత డీఆర్‌జీ బలగాలు ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నాయి. విశాలమైన ప్రదేశంలో హుషారైన పాటలతో తుపాకులు పైకెత్తి సమూహంగా నృత్యాలు చేస్తూ జవాన్లు తమ విజయాన్ని వ్యక్తం చేశారు. ఈ వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

పలువురి గుర్తింపు

మృతిచెందిన పది మంది మావోయిస్టుల్లో ముగ్గురు మహిళలు, ఏడుగురు పురుషులు ఉన్నట్టు పోలీసులు నిర్ధారించారు. వీరిలో దూధి మాసా (డీవీసీఎం), మాద్వి లక్ష్మా (ఏసీఎం), డోరో కోసి (ఏసీఎం), కుంజమ్ బమన్, కాటం కోసం (పీఎల్‌జీఏ కంపెనీ 8 కమాండర్), దూధి హంగి (దూధి మాసా భార్య) ఉన్నారు. మిగతా నలుగురు మావోయిస్టులను ఇంకా గుర్తించాల్సి ఉన్నట్టు అధికారులు తెలిపారు.

రైతులకు న్యాయం చేయలేకపోతున్నాం

- అధికారంలో ఉన్నా లాభం లేదు
- మంత్రుల సమక్షంలో ఎమ్మెల్యేలు బత్తుల, సామేల్, వీరేశం ఆవేదన
- ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే ఈ సమస్య ఉండేది కాదు
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

నల్లగొండ, నవంబర్ 22 : అధికారంలో ఉండి రైతులకు న్యాయం చేయలేకపోతున్నామని మంత్రుల ఎదుట నల్లగొండ ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం నల్లగొండ కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు రఘువీర్ రెడ్డి, కిరణ్‌కుమార్‌తోపాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కోతల సమయంలో రైతులకు అండగా ఉండలేకపోవటం వల్ల గిట్టుబాటు ధర ఇవ్వలేకపోయామని అన్నారు. నెల, 20 రోజుల కింద రైతులు పండించిన ధాన్యంతో రోడ్ల మీదకు వచ్చారని, మిల్లర్లు రైతుల నిస్సహాయతను అదును చేసుకొని తక్కువ ధరకే ధాన్యం తీసుకున్నారని తెలిపారు. కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యేలం కూడా రైతులను ఆదుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ.. అమ్ముకునే సమయంలో రైతులకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వానిపై ఉన్నదని అన్నారు. ఈ విషయమై దృష్టి సారించి ఇక నుంచి ఇలాంటి సమస్య లేకుండా వ్యవసాయ శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడు తప్ప కొనుగోలు కేంద్రాల్లో అధికారులు కనిపించటం లేదని, అసలు బాధ్యత కలిగిన అధికారి క్షేత్ర స్థాయిలో ఉన్నప్పుడే రైతుకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కేంద్రాల్లో కొన్న ధాన్యం మిల్లుల్లోకి తీసుకెళ్లిన తర్వాత కొర్రీలు పెట్టి రైతులకు కోతలు పెడుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యేల వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పందిస్తూ రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. త్వరలో రేషన్‌కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో గత సంవత్సరం వానకాలంలో 40 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా ఈ సారి 45 లక్షల ఎకరాల్లో సాగైనట్టు చెప్పారు.

పారదర్శకంగా 'టైగర్' గ్రామాల తరలింపు

మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ అటవీ పరిధిలోని గ్రామాల తరలింపు పారదర్శకంగా చేపట్టాలని మంత్రి కొండా సురేఖ సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో 26 కోర్ గ్రామాలుండగా 4 గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరిస్తున్నట్టు పేర్కొన్నారు. తొలివిడతలో కవ్వాల్ ప్రాంతంలోని మైసంపేట, రాంపూర్ గూడేలను ఖాళీ చేయిస్తున్నట్టు అధికారులు చెప్పారు. సలేశ్వరం జాతరకు సౌకర్యాలు కల్పించాలని మంత్రి సూచించారు. వన్యప్రాణుల దాడిలో మరణించిన వారి కుటుంబాలకు ఆర్థికసాయం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, వెడ్మ బొజ్జు, రేకుల భూపతిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

'నావలి' విస్తరణ చేయొద్దు

- ఏపీ, కర్నాటక ప్రతిపాదనలు ఆమోదయోగ్యం కాదు
- కేంద్ర మార్గదర్శకాలను అనుసరించాలి
- తుంగభద్ర బోర్డు సమావేశంలో తెలంగాణ వాదనలు

హైదరాబాద్, నవంబర్22 (నమస్తే తెలంగాణ): తుంగభద్ర డ్యామ్‌లో నీటినిల్వ పడిపోయిందని చెబుతూ కర్నాటక చేపట్టనున్న నావలి రిజర్వాయర్ విస్తరణ, అదేవిధంగా హైలెవల్ కెనాల్‌కు సమాంతరంగా మరో కాలువను తవ్వాలని ఏపీ సర్కారు చేసిన ప్రతిపాదనలను తెలంగాణ సర్కారు ఆక్షేపించింది. ట్రిబ్యునల్ అవార్డులో అందుకు సంబంధించిన అంశాలేవీ లేవని స్పష్టం చేసింది. నీటి నిల్వ పెంపు కోసం కేంద్రమార్గదర్శకాలను అనుసరించి ప్రాజెక్టులో పూడికతీతను చేపట్టాలని స్పష్టం చేసింది. 220వ తుంగభద్ర రివర్ బోర్డు సమావేశం హోస్పేట్ కేంద్రంగా శుక్రవారం నిర్వహించారు. హైబ్రిడ్‌మోడ్‌లో కొనసాగిన ఈ సమావేశానికి కేంద్ర జల్‌శక్తిశాఖ జాయింట్ సెక్రటరీ రిచామిశ్రాతోపాటు, కర్నాటక జలవనరుల శాఖ సెక్రటరీ కృష్ణమూర్తి బీ కులకర్ణి, తెలంగాణ, ఏపీ సాగునీటిపారుదల శాఖల ఈఎన్సీలు అనిల్‌కుమార్, వెంకటేశ్వరరావు హాజరయ్యారు. తుంగభద్ర డ్యామ్ వద్ద కేటాయింపులకు మించి జలాలను వినియోగించుకునేందుకు ట్రిబ్యునల్ 1 అవార్డులో ఎలాంటి నిబంధనలు లేవని నొక్కిచెప్పారు. కర్నాటక, ఏపీ రాష్ట్రాల ప్రతిపాదనలతో శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహాలు గణనీయంగా తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై అనేకసార్లు బోర్డుకు స్పష్టం చేశామని గుర్తుచేశారు.

కేసీకెనాల్‌కు నీళ్ల మళ్లింపు తగదు..

కేసీకెనాల్‌కు తుంగభద్ర డ్యామ్ హైలెవల్ కెనాల్ ద్వారా జలాలను మళ్లించేందుకు అనుమతించాలని ఏపీ చేసిన ప్రతిపాదనలను తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. కృష్ణా ట్రిబ్యునల్ (బచావత్ ట్రిబ్యునల్) అవార్డు ప్రకారం కడప- కర్నూల్ కెనాల్‌కు సుంకేసుల బరాజ్ నుంచి మాత్రమే తుంగభద్ర నదీజలాలను మాత్రమే వాడుకోవాలని గుర్తుచేశారు. అయితే ఏపీ ఆది నుంచి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తింది. తుంగభద్ర నదీజలాలకు బదులుగా శ్రీశైలం రిజర్వాయర్ నుంచి అనుమతుల్లేని పలు ప్రాజెక్టుల కృష్ణా జలాలను కేసీ కెనాల్‌కు మళ్లిస్తున్నదని ఆక్షేపించింది. తాజాగా చేసిన ప్రతిపాదనలపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏపీ అక్రమ మళ్లింపులను తుంగభద్ర బోర్డు అంగీకరిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని తెలంగాణ ఈఎన్సీ వ్యతిరేకించారు. ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా నిర్ణయాలను తీసుకోవద్దని బోర్డుకు సూచించారు. తెలంగాణ అంతర్రాష్ట్ర జలవిభాగం ఎస్ఈ సల్లా విజయ్ కుమార్‌తోపాటు ఇంజినీర్లు పాల్గొన్నారు.

- 6 వేల పెన్షన్ ఇవ్వాలని దివ్యాంగుల నిరసన

కాంగ్రెస్ హామీ మేరకు వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మంచిర్యాలలోని ఐబీ చౌరస్తాలో దివ్యాంగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా కాంగ్రెస్ సర్కార్ మాట నిలబెట్టుకోలేదని మండిపడ్డారు.

– మంచిర్యాల టౌన్

- తాగు నీటి కోసం మహిళల ధర్నా

మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోని రజకవాడలోగల బోరు బావి విద్యుత్తు మోటర్‌కు మున్సిపాలిటీ సిబ్బంది తాళం వేయడంపై స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

– చెన్నూర్

ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరి హత్య

- ములుగు జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం
- మృతుల్లో పంచాయతీ కార్యదర్శి, అతడి సోదరుడు
- ఆందోళనకు దిగిన గిరిజన సంఘాలు, స్థానికులు

ఉయిక రమేశ్, ఉయిక అర్జున్ (ఫైల్)

వాజేడు, నవంబర్ 22 : ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న పెనుగోలు కాలనీ (బాలలక్ష్మీపురం) గ్రామంలో గురువారం రాత్రి ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఇద్దరిని హతమార్చారు. మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లరంగు దుస్తులు ధరించిన ముగ్గురు వ్యక్తులు పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేశ్ ఇంటికి వచ్చారు. నిద్రలో ఉన్న రమేశ్‌ను లేపి గొడ్డళ్లతో దాడి చేశారు. భార్య ప్రాధేయపడినా వినకుండా నరకడంతో కొన ఊపిరితో ఉన్న రమేశ్‌ను బంధువుల సహాయంతో 108 వాహనంలో ఏటూరునాగారం వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు. తరువాత సదరు ముగ్గురు వ్యక్తులు ఉయిక అర్జున్ ఇంటికి వెళ్లారు. బయటకు తీసుకువెళ్లి మాట్లాడి పంపిస్తామని అతని భార్యకు చెప్పారు. అతడు బయటకు రాగానే గొడ్డళ్లతో నరికి హతమార్చారు. వరుసకు అన్నదమ్ములైన రమేశ్, అర్జున్‌ను మావోయిస్టులు హతమార్చడంతో పెనుగోలు కాలనీ గ్రామస్థులతోపాటు మండల వాసులు ఉలిక్కిపడ్డారు. తమ కదలికలను ఎప్పటికప్పుడు పోలీసులకు చేరవేస్తున్నారని, ఈ విషయమై పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోకపోవడంతో హతమార్చినట్టు భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్టు) వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట ఘటనా స్థలంలో లేఖలు వదిలివెళ్లారు. రమేశ్, అర్జున్ హత్యలను ఖండిస్తూ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన కార్యదర్శులు, ఎంపీవోలు, స్థానిక అధికారులు గిరిజన సంఘాల నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.